క్లుప్తంగా

గ్రామ అభివృద్ధే లక్ష్యం

మొత్కుపల్లి సర్పంచ్ రత్నం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రత్నం

మొయినాబాద్: గ్రామ అభివృద్ధే లక్ష్యమని సర్పంచ్ రత్నం పేర్కొన్నారు. మండల పరిధిలోని మొత్కుపల్లిలో ఉపాధి హామీ పథకం నిధులు, గ్రామ పంచాయతీ నిధులు రూ.10 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో గ్రామంలో అన్ని రకాల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కిరణ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం యూటీఎఫ్‌తోనే సాధ్యం

జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్

కేశంపేట: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు యూటీఎఫ్‌తోనే పరిష్కారమవుతాయని జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అన్నారు. పాపిరెడ్డిగూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ మహాసభ గురువారం నిర్వహించారు. అనంతరం మండల కమిటీని ఎంపిక చేశారు. మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా రామోహన్, ఉపాధ్యక్షుడిగా జ్యోతి, ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, కార్యదర్శులుగా కృష్ణయ్య, నర్సింహులు, స్వప్న, చిన్నారావులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం పని చేయాలన్నారు. అంతకుముందు మృతి చెందిన ప్రధానోపాధ్యాయుడు జంగయ్య చిత్రపటానికి వారు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మనోహర్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు శివారెడ్డి, నర్సింలు, శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో అంకురం, కెరియర్ గైడెన్స్

చేవెళ్ల: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు సహాయ సహకారాలు అందజేస్తున్నామని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ టీనావతి, మండల విద్యాధికారి అక్బర్‌లు పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం అంకురం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వంటకాలు, వస్తువులను తయారుచేసి వాటిని ప్రదర్శనలో ఉంచి విక్రయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండారి శైలజ, ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు తయారు చేసిన పలురకాల వస్తువులను, వంటకాలను చూసి ఆమె అభినందించారు. వారి ప్రతిభను ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు.

ఫ్లెక్సీలు, కాషాయ జెండాల తొలగింపు

ప్రధాన చౌరస్తాలో ధర్నా



చౌరస్తాలో ఆందోళన కారులతో మాట్లాడుతున్న సీఐ వినాయక రెడ్డి

శంకర్‌పల్లి: అయోధ్యలో శ్రీ రాముల వారి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన కాషాయ జెండాలు, శ్రీ రాముడి ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది గురువారం తొలగించారు. ఈ సందర్భంగా ఆగ్రహానికి గురైన స్థానిక విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, స్థానిక వ్యాపారులు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం శంకర్‌పల్లి ప్రధాన చౌరస్తాలో ధర్నా చేపట్టారు. అరగంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం వారు మాట్లాడుతూ శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు పోలీసులకు కనిపించ లేదా? అని వారు ప్రశ్నించారు. హిందువుల మనోభావాలను కించపరిచేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో శంకర్‌పల్లి సీఐ సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన కారులను నచ్చచెప్పి ఆందోళన విరమింప జేశారు.

తొలగించడం సరికాదు: మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి

శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పట్టణ కేంద్రంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బందిని పోలీసులు బెదిరించి ఫ్లెక్సీలను, కాషాయ జెండాలను తొలగించేందుకు ఏ విధంగా తీసుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో సారి ఇటువంటి చర్యలకు పాల్పడితే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆమె బాధ్యులను హెచ్చరించారు.

నూనెగింజల సాగు భలే

- ఆసక్తి చూపుతున్న రైతులు
- తెల్ల కుసుమతో ఆరోగ్యానికి మేలు
- మార్కెట్లో మంచి డిమాండ్



సాగు చేసిన తెల్లకుసుమ పంట

షాబాద్: నూనె గింజల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. తెల్ల కుసుమ పంటను సాగు చేస్తున్నారు. మార్కెట్‌లో దీనికి డిమాండ్ ఉండడమే కాకుండా ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కల్తీ నూనెలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీంతో రైతులు స్వచ్ఛమైన నూనెకోసం ఈ నూనెగింజల సాగుకు మక్కువ చూపుతున్నారు. షాబాద్ మండల పరిధిలోని ముద్దెంగూడ, ఎర్రోనిగూడ, తిర్మలాపూర్, బొబ్బిలిగామ, గొల్లూరుగూడ గ్రామాల్లో 180 మంది రైతులకు అధిక దిగుబడినిచ్చే ఐఎస్ఎఫ్ 746 రకం కుసుమ విత్తనాలు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. రబీ సీజన్‌లో వేసే ఈ పంటల సాగు పట్ల రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. నాణ్యతలేని నకిలీ నూనెలు కుప్పలు తెప్పలుగా మార్కెట్లోకి వస్తున్న నేటి తరుణంలో వినియోగదారుడికి ఏ నూనెను ఉపయోగించాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. గతంలో ఏ ఇంట చూసినా తెల్ల కుసుమల నూనె ఉపాయోగించేవారు. దీంతో ఏడాదిపాటు అవసరమైన ఈ నూనెను నిల్వ చేసుకునేవారు. తెల్లకుసుమ పంట సాగు తగ్గడంతో పరిస్థితిలో మార్పులు చోటుచేసుకున్నాయి. తెల్ల కుసుమను తెల్లజొన్న, శనగ పంటలో అంతర పంటగా సాగు చేసేవారు. అయితే మండలంలో పత్తిసాగు పెరగడం తెల్ల కుసుమ సాగు తగ్గింది. పత్తి పంటను ఖరీఫ్‌లో సాగు చేసినప్పటికీ రబీ పంట కాలం ముగిసే వరకు అధిక దిగుబడి ఇస్తుంది. దీంతో రబీసాగుకు అవరోధం ఏర్పడుతుంది.

పత్తి సాగుతో ముఖ్యంగా మండల ప్రజల ఆహార పంటైన తెల్లజొన్న, శనగ సాగును తీవ్రంగా దెబ్బతీసింది. తెల్ల కుసుమ సాగుకు ప్రభుత్వ పోత్సాహం లభించడంలేదు. ప్రస్తుతం మార్కెట్లో తెల్ల కుసుమలు క్వింటాలుకు రూ. 6వేలు పలుకుతోంది. తెల్ల కుసుమలను కొని మరాడించి తీసిన నూనె కిలో రూ.450లు పలుకుతుంది. గానుగాడించి తీసిన నూనె ఆరోగ్యానికి ఎంతో మేలైంది. ఈ నూనెను కొందామన్నా మార్కెట్లో లభించడం లేదు. మిల్లులో, లేదా రైతుల వద్ద కొనుగోలు చేయాల్సి వస్తోంది. వారి వద్ద సైతం డిమాండ్ మేరకు లభించడంలేదు. ఆరోగ్యానికి ఎంతో మేలైన తెల్ల కుసుమ సాగును వ్యవసాయాధికారులు ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

తెల్ల కుసుమ పంటను సాగు చేస్తున్నాం



గత రెండు సంవత్సరాలుగా తెల్ల కుసుమ పంటను సాగు చేస్తున్నం. పొలంలో పండించిన తెల్ల కుసుమలను గానుగాడించి నిల్వ చేసిన నూనెను ఏడాది పొడవునా వినియోగిస్తాం. రుచికరమైన వంటలకు, ఆరోగ్యానికి ఇది ఎంతో మేలు. మేము తెల్లకుసుమ నూనెనే వాడుతాం. మా బంధువులకు కూడా పంపిస్తాం.

-గంగిడి భూపాల్‌రెడ్డి, రైతు హైతాబాద్, షాబాద్

ఆరోగ్యానికి మంచిది



ఆరోగ్యానికి తెల్ల కుసుమ, నల్ల కుసుమ, నువ్వులు, పల్లి నూనె మంచిది. మార్కెట్‌లో దొరికే కల్తీ నూనెలు వాడి అనారోగ్యం పాలవుతున్నారు. రైతులు నూనె గింజల సాగు చేసి వాటిని వాడుకుంటే మేలు. గతంలో ఏడాది పొడవునా తెల్లకుసుమలను గామగాడించే వారం. నానాటికి ఉత్పత్తులు సైతం పడిపోయాయి. ప్రస్తుతం మార్చి, ఏప్రిల్, మే మూడు నెలలపాటు కుసుమ నూనెలు పండిస్తారు.

-కూర వెంకటయ్య, రైతు ముద్దెంగూడ, షాబాద్



ఇంద్రానగర్‌లో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

అందరి సహకారంతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్/కొందుర్గు: అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఇంద్రానగర్‌లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి శ్రమించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ముఖ్యంగా విద్యా, వైద్య సౌకర్యాల కల్పనకు పాటుపడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధికోసం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహబూబ్‌బీ, మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు, చంద్రశేఖర్, ఆంజనేయులు, సత్యనారాయణ రెడ్డి, పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బూత్ స్థాయి కన్వీనర్ల శిక్షణా శిబిరానికి షాద్‌నగర్ నుంచి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నేతలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందన్నారు. ధనిక రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ అప్పుల ఊబిలోకి నెట్టారని చెప్పారు. ప్రజా వ్యతిరేఖ విధానాలు చేపట్టిన బీఆర్‌ఎస్‌కు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. బాబర్‌ఖాన్, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ఐన్యం, జగదీశ్వరప్ప, జితేందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోదండరామ్‌కు నేతల శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ కోదండరాంతో టీజీ శ్రీనివాస్

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ ఉద్యమకారుడు, ప్రొఫెసర్ కోదండరామ్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా పదవి దక్కింది. గురువారం టీజేఏసీ రాష్ట్ర నాయకుడు టీజీ శ్రీనివాస్ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టీజీ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ ఉద్యమకారులను ద్రోహం చేసిందని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం ప్రాణాలను పణంగాపెట్టి అలుపెరగని ఉద్యమం చేసిన వారిని అణగద్రొక్కారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసలైన ఉద్యమాకారులను మోసంచేసి తెలంగాణ ద్రోహులను అందలమెక్కించిందని అన్నారు. తెలంగాణ సాధించిన తొమ్మిది సంవత్సరాల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొఫెసర్ కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు. కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవికి సిఫారసు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు.

యువత సమాజ సేవ అలవర్చుకోవాలి



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న గౌతమ్‌కుమార్

మొయినాబాద్: యువత సమాజ సేవ అలవర్చుకోవాలని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన గుమ్మళ్ల సీతారాంరెడ్డి కూతురు శ్రీతన్యరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా 320 కుట్టు మిషన్లను గురువారం తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాలు చేపట్టడం శుభపరిణామమన్నారు. ఆర్‌ఐ చంద్రమోహన్, వార్డు సభ్యులు విక్రంరెడ్డి, నారాయణరెడ్డి, పాల్గొన్నారు.

అమ్మఒడి యాప్ ద్వారా వైద్య సేవలు

డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్



మాట్లాడుతున్న దామోదర్

చేవెళ్ల: గ్రామీణ ప్రాంతంలోని గర్భిణీలు, బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అమ్మఒడి యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ అన్నారు. గురువారం డివిజన్‌లోని ఏఎన్‌ఎంలకు అమ్మఒడి యాప్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మఒడి యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు దీన్ని ఉపయోగించడం నేర్చుకోవాలన్నారు. దీంట్లో వచ్చే సందేశాలను ఎప్పటికప్పుడు గమనించాలని వాటిపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. గర్భిణీలు, బాలింతలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు ఈ యాప్‌లో నమోదు చేసి నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. దీనికి సంబంధించిన అంశాలపై డివిజన్‌లోని 38సబ్‌సెంటర్లలోని 58 మంది ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ శిక్షణను డాక్టర్లు రేవతి, వాణిలు అందిస్తారన్నారు. ఉదయం 11 గంటలనుంచి సాయంత్రం 4గంటలవరకు కొనసాగుతుందని చెప్పారు. సీహెచ్‌ఓలు గోపాల్‌రెడ్డి, సంతోష, వైద్యవిద్య అధికారి సుదర్శన్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అంజనేయులు

కొందుర్గు: గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నూతన క్యాలెండర్‌ను కొందుర్గు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ అంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు కనీసవేతన చట్టం అమలు చేయాలన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా కార్మికుల సమస్యలు తీరడం లేదన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రయ్య, భాగ్యమ్మ, మంజుల, సత్యమ్మ, ప్రవీణ్, జంగమ్మ పాల్గొన్నారు.

పాత పద్ధతిలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయాలి

రియల్ ఎస్టేట్ అసోసియేషన్ వినతి



మంత్రితో రియల్ ఎస్టేట్ అసోసియేషన్ నాయకులు

షాద్‌నగర్: గ్రామ పంచాయతీ పరిధిలో మిగిలిపోయిన లేఅవుట్‌లను పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ గురువారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సెక్రెటేరియట్‌లోని మంత్రి ఛాంబర్‌కు రియల్ ఎస్టేట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారగోని ప్రవీణ్‌కుమార్, షాద్‌నగర్ అధ్యక్షుడు వీర్లగూడెం రాజుగౌడ్‌లు గ్రామ పంచాయతీ లేఅవుట్ విషయాన్ని మంత్రి దృష్టికి తెచ్చారు. గతంలో మిగిలిపోయిన ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయడం లేదని వారు మంత్రితో చెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్లాట్ల యజమానులు, కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జీపీ లేఅవుట్‌లోని ప్లాట్లను, హైకోర్టు ఆర్డర్‌తో రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్లు, జీపీఏ, ఏజీపీఏ ప్లాట్లను వెంటనే రిజిస్ట్రేషన్ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు కోరారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ257ను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వారు మంత్రికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎండీ సాదిక్ అలీ, లక్ష్మణ్ రావు, తోట ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

కేసారం సర్పంచ్ కాసుల రమేశ్‌గౌడ్

చేవెళ్ల: గ్రామాన్ని అందరి సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు కేసారం సర్పంచ్ కాసుల రమేశ్‌గౌడ్ అన్నారు. గురువారం రూ. 8లక్షల గ్రామ పంచాయతీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులతోపాటు దాతల నుంచి సేకరించిన నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేశామని, మిగిలిపోయిన కొన్ని పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రజిత, గ్రామ కార్యదర్శి అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల అభివృద్ధికి కృషి..

చేవెళ్లలోని పలు కాలనీలలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేయిస్తున్నట్లు సర్పంచ్ బండారి శైలజ అన్నారు. టీచర్స్‌కాలనీ, చంద్రారెడ్డినగర్, వీరభద్ర, జర్నలిస్ట్ కాలనీలకు సంబంధించి డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొంత కాలంగా ఈ కాలనీలలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని చెప్పడంతో సమస్య పరిష్కరించేందుకు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఉప సర్పంచ్ గంగి యాదయ్య, వార్డు సభ్యులు టేకుపల్లి శ్రీనివాస్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ఎస్ఐ వరప్రసాద్



వ్యాసం రాస్తున్న విద్యార్థులు

కేశంపేట: విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఎస్ఐ బిఎస్ఎస్ వరప్రసాద్ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బిఎస్ఎస్ వరప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలన్నారు. ఉల్లసంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఆయన చెప్పారు. వ్యాసరచన పోటీల్లో భాగంగా విద్యార్థులకు 'భారత రాజ్యాంగం గొప్పతనం' అనే అంశంపై పోటీ నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



మాట్లాడుతున్న అంజయ్య యాదవ్

నందిగామ: బీఆర్‌ఎస్ ఓటమి చెందిందని కార్యకర్తలు అధైర్యపడొద్దని, తాను ఏ సమయంలోనైనా అందుబాటులో ఉండి, సమస్య పరిష్కారానికి అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని నర్సప్పగూడ, చేగూరు, బుగ్గోనిగూడ, బండోనిగూడ, వెంకమ్మగూడ గ్రామాలలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సర్వసాధారణమని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, ఎంపీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ జెడ్పీవైస్ చైర్మన్ నవీన్ రెడ్డి, సర్పంచులు గోవిందు అశోక్ కుమార్, మామిళ్ల సంతోష, జెట్ట కుమార్, బండి నీలమ్మ, రజనీ, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, సుదర్శన్ గౌడ్, కుమార్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటు పునాది

తహసీల్దార్ పార్థసారథి



చేవెళ్ల: సీనియర్ సిటీజన్లను సన్మానిస్తున్న ఆర్డీఓ సాయిరాం



షాద్‌నగర్: ర్యాలీ ప్రారంభిస్తున్న తహసీల్దార్ పార్థసారథి



కొందుర్గు: చౌదరిగూడలో ర్యాలీ



కేశంపేట: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

చేవెళ్ల: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం పేర్కొన్నారు. చేవెళ్ల ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం విద్యార్థులతో ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ కాంచనలత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ క్రిష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జ్యోతి పాల్గొన్నారు.

షాద్‌నగర్: ప్రజాస్వామ్యానికి ఓటు పునాదిలాంటిదని తహసీల్దార్ పార్థసారథి అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియం నుంచి చౌరస్తా వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి రెవెన్యూ, మున్సిపల్, విద్యా, వైద్యశాఖల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఆర్ఐ సలీం, విజయలక్ష్మి, కొత్తూరు, నందిగామ తహసీల్దార్లు అయ్యప్ప, జానకి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డాక్టర్ జగదీష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తలసాని వెంకటరెడ్డి, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ గీత, ఆర్ఐ నివేదిత, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాలతోపాటు వివిధ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. చౌదరిగూడలో ఎంపీడీఓ మహేష్‌బాబు మాట్లాడారు. ఎంఆర్ఐ హేందర్ గౌడ్, సర్పంచ్ స్వామి, ఏపీఎం రామస్వామి పాల్గొన్నారు.